
సాక్షి
ఒడిశా
ఆదివారం । 21 । జూలై । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 3,03,929
బంగారం: 4 గ్రాముల 350 మిల్లీ గ్రాములు
వెండి: 15 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరి



సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి

జయపురం గగణాపూర్ సేవా పేపరు మిల్లు విశ్రాంత శ్రామికులు శుక్రవారం జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

- 8లో



విరిగిపడిన కొండ చరియలు

మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి ముదిలి పోడ పంచాయతీ బోండఘాటీపై కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో ఖోయిర్‌పూట్ రహదారి మూసివేశారు.

- 8లో

న్యూస్‌రీల్

దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక కోర్టు



కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న దివ్యాంగుడు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక క్యాంపు కోర్టు ఏర్పాటుచేశారు. భువనేశ్వర్ నుంచి దివ్యాంగుల రాష్ట్ర కమిషనర్ బ్రోతోతి హరిచందన్, ప్రత్యేక నామినేటెడ్ కార్యదర్శి పూర్ణచంద్ర సాహు, పరామర్శదాత సురేంద్ర బోరోళో విచ్చేసి వినతులు స్వీకరించారు. తనకు ఇంటి పట్టా ఇప్పించాలని కాశీనగర్ గ్రామానికి చెందిన తిరుపతి గోంతో అనే దివ్యాంగుడు కమిషనర్‌ను కోరారు. మరికొందరు తమ సమస్యలపై విన్నవించారు. జిల్లా సామాజిక సుర్‌క్షా అధికారి సంతోష్‌కుమార్ నాయక్ పర్యవేక్షించారు.

కోతకు గురైన రోడ్డు



బుడాగుడ సమీపంలో కోతకు గురవుతున్న రహదారి

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి బుడాగుడ పంచాయతీ గురుతులి, కుంభార్ ప్రాంతాలకు అనుసంధానించే బుడాగుడ రహదారి ఇటీవల కురుస్తున్న వర్షాలకు కోతకు గురవుతోంది. మట్టి జారిపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కాసీపూర్, టికిరి వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఈ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నదిలో యువతి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: నదిలో స్నానానికి వెళ్లి గల్లంతైన యువతి మృతదేహం శనివారం లభ్యమయ్యింది. మృతురాలు కాసీపూర్ సమితి మైకంచ్ పంచాయతీలోని నువాగా గ్రామానికి చెందిన మోహన్ మాఝి కుమార్తె ములు మాఝి(23)గా గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ములు మాఝి అనే యువతి సమీపంలోని ఒక నదిలో స్నానానికి గత మంగళవారం వెళ్లింది. అయితే స్నానానికి వెళ్లిన తన కూతురు ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామస్తుల సాయంతో బాధిత కుటుంబీకులు అన్ని ప్రాంతాల్లో వెతికారు. యువతి ఆచూకీ లభించకపోవడంతో ఒంఢ్రాకంచ్ పోలీసుస్టేషన్‌లో యువతి తండ్రి మోహన్ ఫిర్యాదు చేశాడు. అయితే శనివారం అటువైపుగా వెళ్తున్న కొందరికి ఒక యువతి మృతదేహం నదిలో తేలుతూ కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో నదిలో మృతదేహాన్ని బయటకు తీశారు. లభించిన మృతదేహం ములు మాఝిగా గుర్తించడంతో కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

పిడుగుపాటుకు 13 మందికి గాయాలు



ఉమ్మర్‌కోట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

కొరాపుట్: పిడుగుపాటుకు 13 మంది మహిళలు గాయపడిన ఘటన నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి నందపూర గ్రామ పంచాయతీలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన 15 మంది మహిళలు పొలంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఆ సమయంలో ఉరుములు మెరుపులతో అకస్మాత్తుగా వారికి సమీపంలో పిడుగు పడటంతో 13 మంది గాయాలుపాలై అచేతనంగా పడిపోయారు. మిగిలిన ఇద్దరు మహిళలు గ్రామానికి వెళ్లి విషయాన్ని తెలియజేశారు. వెంటనే గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఉమ్మర్‌కోట్ పట్టణంలోని సబ్ డివిజనల్ కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ విషమ పరిస్థితిలో ఉన్న నిక్కి కందపాన్, పార్వతీ బోత్రలను నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పోటెత్తిన వరద



కొరాపుట్: పపడాహండి వద్ద రోడ్డుపైకి వచ్చిన టురి నదీ ప్రవాహం



కొరాపుట్: నబరంగ్‌పూర్ ఉమెన్స్ కాలేజీ రోడ్డులో వరదనీరు

- కొరాపుట్ జిల్లాలో రోడ్లపై నదుల ప్రవాహం
- నిలిచిన వాహనాల రాకపోకలు

కొరాపుట్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి అవిభక్త కొరాపుట్ జిల్లాలు ముంపు బారిన పడ్డాయి. శనివారం ఉదయం నదులు పొంగి ప్రవహించడంతో జనజీవనం స్తంభించింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నదీ ప్రవాహం రోడ్లపైకి రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నబరంగ్‌పూర్–ఉమ్మర్‌కోట్ పట్టణాల మధ్య పపడా హండి వద్ద టురి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సాహిద్ మినార్ వద్ద జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు బ్రేక్‌పడింది. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి వద్ద నది పొంగడంతో ఆయా ప్రాంతాలకు రవాణా స్తంభించింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కాలేజీ రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. కొడింగా తదితర ప్రాంతాలకు వాహన సేవలు నిలిచిపోయాయి. మరోవైపు హైదరాబాద్ నుంచి కొరాపుట్ జిల్లాలకు వచ్చే సుదూర ప్రాంత బస్సులు నిలిచిపోయాయి. మల్కన్‌గిరి జిల్లాలో నదులు ఉద్ధృతంగా ప్రవహించడంతో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. కొన్ని హైదరాబాద్ బస్సులు ఛత్తీస్‌గఢ్ మీదుగా కొరాపుట్ జిల్లాల వైపు వస్తున్నాయి.

ఉద్ధృతంగా నదీ ప్రవాహం..

కొరాపుట్ జిల్లాల్లో పెద్ద ఎత్తున నదులు ప్రవహిస్తున్నాయి. గోదావరి నదికి ఉప నది అయిన ఇంద్రావతి పోటెత్తింది. టురి, శబరి, బస్కల్, గుంతాయిత్, కొలాబ్ నదుల్లో సైతం ప్రవాహం ఉద్ధృతంగా ఉంది. దీంతో కటాఫ్ ఏరియా, లోతట్టు ప్రాంతాలు, నదులపై రాక పోకలు సాగించే గ్రామాల ప్రజలు అధికారులు అప్రమత్తం చేశారు.మరోవైపు కేవలం వర్షాధార వ్యవసాయంపై ఆధార పడే కొరాపుట్ జిల్లాల ప్రజలకు ఈ వర్షాలు వరంగా మారాయి. వేలాది మంది గిరిజనులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టణ ప్రాంతాలలో ఉండే భవన నిర్మాణ, వ్యాపార రంగాలలో ఉండే కూలీలు సైతం గ్రామాలకు తరలి వెళ్లి పొలం పనుల్లో పాల్గొంటున్నారు.

గజపతి జిల్లాకు తప్పిన వరద ముప్పు.

పర్లాకిమిడి: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు శనివారం కాస్త శాంతించడంతో గజపతి జిల్లాకు వరద ముప్పు తప్పింది. కాశీనగర్ వంశధార నదిలో వరద నీటి మట్టం 51.0 మీటర్లుకు చేరింది. ఎగువ కాట్రగత వద్ద వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో కాశీనగర్ నగర పంచాయితీకి వరదముప్పు తప్పింది. పర్లాకిమిడిలో మహేంద్రతనయలో వరద నీరు చేరడంతో అటు ఆంధ్రప్రదేశ్ హిరమండళం వైపు ప్రవహిస్తోంది.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని బలిసాగర్ వద్ద వరద నీరు పోటెత్తింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ఏడో వార్డు ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. హట్‌పాడ, పాత్రోగూడ వీధులు జలమయమయ్యాయి.

ఇంటి పైకప్పు కూలి తల్లీకుమార్తెలకు గాయాలు

జయపురం: వర్షాల ధాటికి జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలో పలు ఇళ్లు కూలిపోయాయి. అటల్‌గుడలో ఇంటి పైకప్పు కూలిన ఘటనలో తల్లీ కుమార్తెలు గాయపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి బాధితులను బొయిపరిగడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.



పర్లాకిమిడి: మహేంద్రతనయ నదిలో చేరిన వరదనీరు



మల్కన్‌గిరి: హట్‌పాడవీధిలో ఇళ్లలోకి చేరిన నీరు



పర్లాకిమిడి: పాతపట్నం - పర్లాకిమిడి సరిహద్దు మహేంద్రతనయ నది



మల్కన్‌గిరి: కలిమెల సమితి పొట్టేరు నదిలో వరద ఉద్ధృతి



మల్కన్‌గిరి: హట్‌పాడ వీధిలో వరదనీటిలో చిక్కుకున్న స్థానికుడు



మల్కన్‌గిరి: నిరసన వ్యక్తం చేస్తున్న 7వ వార్డు మహిళలు



జయపురం: అటల్‌గుడలో కుప్పకూలిన ఇల్లు



మల్కన్‌గిరి: పాత్రోగూఢ వీధిలో నీటి ఉద్ధృతి

మూడు రాష్ట్రాలకు రాకపోకలు బంద్

మల్కన్‌గిరి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కలిమెల సమితి పోట్టేరు, కంగుర్‌కొండ, ఎంవీ 96, ఎంవీ 90 గ్రామాల వద్దనున్న వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్, రాయపూర్, భద్రాచలం, విశాఖ వెళ్లే బస్సులన్నీ నిలిచిపోయాయి. దీంతో మూడు రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయినట్లైంది. మత్తిలి సమితి పంగం వద్ద కూడా వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తోంది. మల్కన్‌గిరి –జయపురం ముఖ్య రహదారి బంద్ అయిపోయింది. తమ్సా నది పోటెత్తడంతో మల్కన్‌గిరి నుంచి జగదల్‌పూర్, సుకుమ వెళ్లే బస్సులు ఆగిపోయాయి. ఆయా చోట్ల సహాయక చర్యలు చేపట్టారు.



కంగుర్‌కొండ వంతెన వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు



కలిమెల సమితి ఎంవీ 54 గ్రామంలో ఇంటిలోకి వస్తున్న వరద నీరు

కమలా పూజారి కన్నుమూత

- అనారోగ్యంతో చికిత్స పొందతూ గండెపోటుతో మృతి



కటక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కమలా పూజారి (ఫైల్)



రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ అందుకుంటున్న కమలా పూజారి (ఫైల్)

భువనేశ్వర్/జయపురం: పద్మశ్రీ కమలా పూజారి(70) కటక్ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. కిడ్నీ సంబంధిత వ్యాధి చికిత్స కోసం ఆమెను గురువారం ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రి ఐసీయూలో చేర్చారు. శనివారం ఉదయం 5.45 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

ఆమె కొరాపుట్ జిల్లాలోని మారుమూల గ్రామానికి చెందిన ఒక గిరిజన మహిళ. సేంద్రీయ వ్యవసాయం, సాంప్రదాయ విత్తనాల సంరక్షణ, సేంద్రీయ సాగుపై గిరిజనుల్లో అవగాహన కల్పించారు. దీంతో ఆమెను 2019లో భారత ప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించింది. 2018లో రాష్ట్ర ప్రణాళికా మండలి సభ్యురాలిగా ఎంపికైన మొదటి గిరిజన మహిళగా రికార్డు నెలకొల్పారు. మహిళా సాధికారత, అటవీ సంరక్షణ మరియు సేంద్రీయ వ్యవసాయంలో ఆమె చేసిన కృషి చిరస్మరణీయం. లోతైన పరిజ్ఞానం కలిగిన సాదాసీదా వైజ్ఞానికురాలిగా పలువురి మన్ననలు పొందారు.

ప్రముఖుల సంతాపం

పద్మశ్రీ కమలా పూజారి మృతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కమలా పూజారి కుమారుడు టొంకొధొరా పూజారితో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె మృతి యావత్ దేశానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియలను పూర్తి గౌరవ లాంఛనాలతో నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా మృతిపై రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ సంతాపం వ్యక్తం చేశారు. దేశవాళీ వరి, ఇతర ధాన్యాలను ఆదా చేస్తూ సేంద్రీయ వ్యవసాయం ద్వారా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఆమె చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. వివిధ రకాల వరిని సేకరించడం, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో ఆమె సాధించిన అరుదైన విజయాలు ఎల్లప్పుడూ స్ఫూర్తికి మూలంగా నిలుస్తాయని విపక్ష నేత నవీన్ పట్నాయక్ శ్రద్ధాంజలి ఘటించారు.

రాష్ట్రపతి విచారం

కమలా పూజారి మృతి చెందడం బాధాకరమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న, అరుదైన వరి విత్తనాలను, ఇతర పంటలను సంరక్షించడంలో ఆమె స్ఫూర్తిదాయకమైన చొరవ మరువలేనిదన్నారు. సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణకు ఆమె చేసిన కృషి గుర్తుండిపోతుందని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జయపురంలో విషాదఛాయలు

కమలా పూజారి మరణ వార్తతో జయపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె మరణం వ్యవసాయ రంగానికి తీరనిలోటని పలువురు వ్యాఖ్యానించారు. కటక్ నుంచి రానున్న ఆమె మృతదేహానికి భారీగా స్వాగతం పలికేందుకు రైతులు, ప్రజలు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె బొయిపరిగుడ సమితి మారుమూల కంటికిగుడ గ్రామంలో 1945లో జన్మించారు. వివాహం అనంతరం జయపురం సమితి పాత్రోపుట్ గ్రామంలో ఉంటున్నారు. గిరిజన మహిళ అయినటువంటి కమల పూజారి, 1998లో జయపురంలో నెలకొల్పిన ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రోత్సాహంతో ట్రెడిషనల్ విత్తనాల సేకరణకు నడుం బిగించింది. ఆమెకు 2019 మార్చి 16న కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో సన్మానించగా, 2002లో ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీకి కమలా పూజారి పేరు పెట్టారు. అదే ఏడాది జోహాన్స్‌బర్గ్‌లో ఈక్వేటర్ ఆఫ్ ఇన్సియేషన్ అవార్డు పొందారు. 2024లో ఆమెను ఒడిశా ప్రభుత్వం ఉత్తమ మహిళా రైతు అవార్డుతో సత్కరించింది. ఆమెను కేంద్ర ప్రభుత్వం కృషి విశారద జాతీయ అవార్డుతో సన్మానించింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెను స్టేట్ ప్లానింగ్ బోర్డు సభ్యురాలుగా నియమించింది.

ప్రధాని సానుభూతి

కమలా పూజారి వ్యవసాయానికి స్మారక సహకారాన్ని అందించిందని ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించి దేశీయ విత్తనాల సంరక్షణతో సంప్రదాయ సాగు సుస్థిరతను సుసంపన్నం చేయడంలో ఆమె చేసిన కృషి గుర్తుండిపోతుందన్నారు.



ఎంఎస్ స్వామినాథన్ తదితరులతో కమలా పూజారి(ఫైల్)



విదేశాల్లో తన గైడ్‌తో కమలా పూజారి(ఫైల్)

రైల్వే అర్బన్ బ్యాంకు.. ఎన్నికలకు వేళాయె!

- ఏఐఆర్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐఆర్ పోటాపోటీ
- తొమ్మిదేళ్ల విరామం అనంతరం నిర్వహణ
- ఈ నెల 24 నుంచి 3 జోన్లు, 11 మండలాల్లో పోలింగ్



పి.కె.పటసహాణి, డైరెక్టరు, అర్బన్ బ్యాంకు

భువనేశ్వర్: అవిభాజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార సంస్థ (అర్బన్ బ్యాంకు) ఎన్నికలకు రంగం సిద్ధమైంది. 3 జోనులు (ఆగ్నేయ, ఆగ్నేయ మధ్య, తూర్పు కోస్తా), 11 మండలాల్లో పోలింగు నిర్వహిస్తారు. వీటి పరిధిలో 695 స్థానాల్లో డెలిగేటుల్ని 1,36,337 మంది ఓటర్లు ఎన్నుకుంటారు. అర్బన్ బ్యాంకు వాటాదార్లు ఓటర్లుగా పాలుపంచుకుంటారు. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఎన్నికలు జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రధాన పోటీ అఖిల భారత రైల్వే కార్మిక సమాఖ్య (ఏఐఆర్‌ఎఫ్), రైల్వే కార్మిక జాతీయ సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐఆర్) మధ్య నెలకొని ఉంది. గత ఎన్నికల్లో ఏఐఆర్‌ఎఫ్ విజయకేతనం ఎగుర వేసింది.

రెండు విడతల్లో..

రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. ఈ నెల 24, 25 తేదీల్లో పోలింగు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. ఎన్నికల సమగ్ర ప్రక్రియ ఈ నెల 30తో ముగుస్తుంది. 2010 నుంచి ఏఐఆర్‌ఎఫ్ అధికారంలో కొనసాగుతుంది. ఐదేళ్లకోసారి నిబంధన మేరకు 2015లో జరగాల్సిన ఎన్నికలకు అంతరాయం ఏర్పడింది. ప్రత్యర్థి వర్గం వివాదంతో ఈ ఎన్నికల నిర్వహణకు అంతరాయం ఏర్పడిందని అర్బన్ బ్యాంకు డైరెక్టరు, ఏఐఆర్‌ఎఫ్ అనుబంధ సంస్థ తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పటసహాణీ తెలిపారు.

అవిభాజితం లాభదాయకం..

దేశ వ్యాప్తంగా రైల్వే జోన్ల విభజన జరిగిన వీటి అధీనంలో అర్బన్ బ్యాంకు వ్యవస్థ అవిభాజన ప్రామాణికంతో కొనసాగుతుంది. విభజనతో బ్యాంకు భాగస్వాముల లబ్ధికి గండిపడుతుంది. మూలధనం కుచించుకుపోయి లాభం వాటా (డివిడెండ్), పొదుపు ఖాతా వడ్డీ, రుణ పరిమితి వంటి వాటాదారుల సంక్షేమ కార్యకలాపాలకు నిధుల కొరత తలెత్తుతుంది. ఇక్కడ మాత్రం ప్రస్తుతం జాతీయ, ప్రైవేటు బ్యాంకుల కంటే అధికంగా పొదుపు ఖాతాపై అధిక రేటు వడ్డీ మంజూరు కొనసాగుతుంది. 59,971 మంది అత్యధిక వాటాదారులతో ఆగ్నేయ రైల్వే అగ్ర స్థానంలో ఉండగా 38,915 మంది ఓటర్లతో ఆగ్నేయ మధ్య రైల్వే తదుపరి ఆధిక్యతలో ఉంది. అతి తక్కువగా 37,451 మంది వాటాదారులతో తూర్పు కోస్తా రైల్వే అట్టడుగున కొసాగుతుంది. ఈ నేపథ్యంలో విభజన ఎంత మాత్రం శ్రేయోదాయకం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



అర్బన్ బ్యాంకు

ప్రాంతీయ కార్యాలయాలు..

వాటాదారులకు చేరువలో సేవలు కల్పించేందుకు అవిభాజిత ఆగ్నేయ రైల్వే జోన్ వ్యాప్తంగా ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని ఏఐఆర్‌ఎఫ్ హామీ ఇచ్చింది. తూర్పు కోస్తా రైల్వే పరిధిలో అత్యధికంగా 12 చోట్ల ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని హామీ పత్రం విడుదల చేశారు. రోజువారీ నగదు కార్యకలాపాల సౌలభ్యం కోసం ప్రభుత్వ రంగ బ్యాంకుల తరహాలో ఏటీఎం, దరఖాస్తు దాఖలు చేసిన రోజున రుణ మంజూరు, పిల్లల ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక మద్దతు కల్పిస్తారు.

రుణమాఫీ..

విపత్కర పరిస్థితుల్లో వాటాదారులకు రుణమాఫీ ప్రకటించారు. రుణం తిరిగి చెల్లింపు వ్యవధిలో అకాల మరణానికి గురైన పరిస్థితుల్లో ఈ సదుపాయం లభిస్తుంది. బాధిత కుటుంబీకులకు చెల్లిస్తున్న పరిహారం పరిమితిని రూ.10 వేలు నుంచి రూ.3 లక్షలకు విస్తరిస్తారు. కనిష్ట రుణ మంజూరు పరిమితిని రూ.10 లక్షలకు విస్తరించి గరిష్ట పరిమితిని భారత రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు మంజూరు చేస్తారని హామీ పత్రాల్లో పేర్కొన్నారు.

పర్యాటక విడిది..

వాటాదారులు, కుటుంబీకులు విడిది చేసేందుకు దేశంలో 10 ప్రముఖ ప్రాంతాల్లో హాలిడే హోమ్‌లు నిర్మిస్తారు. ఈ జాబితాలో న్యూఢిల్లీ, అజ్మీరు, అయోధ్య, ద్వారక, ఉజ్జయిని, ముంబై, భువనేశ్వర్, సికింద్రాబాద్, విశాఖపట్నం, చెన్నై ఉన్నాయి.

క్లుప్తంగా

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కొత్త క్రిమినల్ చట్టాలపై మరింతగా అవగాహన పెంచుకోవాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్స్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఎస్సీ ఎస్టీ కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రాసిక్యూషన్ ఆఫీసులో శనివారం సమావేశం నిర్వహించారు. జూలై ఒకటి నుంచి ఈ కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, వాటిని చదివి వాటికి అనుగుణంగా కేసులు విచారించాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులో గల రైల్వే ట్రాక్‌పై శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. స్థానికులు కాపాడడంతో బతికిపోయాడు. సాయంత్రం 5గంటల సమయంలో గుణుపూర్ నుంచి విశాఖపట్నం వెళ్లే పాసింజర్ వచ్చే సమయానికి ఓ వ్యక్తి ఒక్కసారిగా రైలు పట్టాలపైన పడుకున్నాడు. స్థానికులు గుర్తించి ఆ వ్యక్తిని పట్టాల పైనుంచి బయటకు లాగేయడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఆ వ్యక్తిని స్థానికులు ప్రశ్నించగా తాను చచ్చిపోతానని తనది గొల్లవీధి అని చెప్పాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చే సమయానికి ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

నీట మునిగిన చినకొవ్వాడ పాఠశాల



చినకొవ్వాడలో నీట మునిగిన ప్రభుత్వ పాఠశాల

రణస్థలం: మండలంలోని కొవ్వాడ పంచాయతీలో గల చిన కొవ్వాడలో గల మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు ప్రవేశించి పాఠశాల పూర్తిగా మునిగిపోయింది. పాఠశాల ప్రహరీ విరిగిపోవడం వల్ల ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీరు పాఠశాలలోకి చేరుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నీరు మరో మూడు రోజుల పాటు అలాగే ఉంటుందని, ప్రహరీ నిర్మించాలని వారు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



పున్నానపాలెంలో చనిపోయిన గొర్రెలు పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

రణస్థలం: మండలంలోని సంచాం పంచాయతీలో గల పున్నానపాలెం గ్రామానికి చెందిన ఇప్పిలి రమణకు చెందిన 13 గొర్రెలు, రెండు మేకలు వీధి కుక్కల దాడిలో చనిపోయాయి. బాధితుడు రమణ తెలిపిన వివరాలు ప్రకారం .. సంచాం కొండ వద్ద శుక్రవారం రాత్రి గొర్రెల మందను పెట్టారు. సుమారు 12 వీధి కుక్కలు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గొర్రెల మందపై దాడి చేసి చంపేశాయని బాధితుడు వాపోయాడు. రణస్థలం పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.దుర్గారావు సంఘటన స్థలాన్ని పరిశీలించి చనిపోయిన గొర్రెలు, మేకలకు శవ పంచనామా చేయించారు. గాయపడిన వాటికి చికిత్స అందజేశారు. బాధితుడికి సుమారు రెండు లక్షలు నష్టం వాటిల్లిందని, గొర్రెలకు బీమా చేయలేదని తెలిపారు. బాధితుడు రమణ మాట్లాడుతూ 13 గొర్రెలు, రెండు మేకలు చనిపోగా, మరో ఐదు గాయపడ్డాయని వీటికి జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలని రోదిస్తున్నాడు.

ఆదిత్య విద్యార్థికి ఇండియా బుక్‌లో స్థానం



విద్యార్థిని వర్షప్రియను అభినందిస్తున్న ఆదిత్య కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థి బోటు వర్షప్రియ ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించింది. ఈ మేరకు శనివారం కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావుతో పాటు అధ్యాపకులు విద్యార్థిని వర్షప్రియను అభినందించారు. హరియాణాలోని ఫరీదాబాద్ కేంద్రంగా 2006లో స్థాపించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో విద్యార్థి స్థానం సంపాదించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి వర్షప్రియ 17.15 నిమిషాల్లో పెన్సిల్ ముల్లుపై ఏ నుంచి జెడ్ వరకు గల 26 అంకెలను బ్లేడ్ సహాయంతో చెక్కడం వల్ల ఇండియా బుక్ స్థానం చోటు సంపాదించినట్లు పేర్కొన్నారు.

విరిగిపడిన కొండ చరియలు



కొండచరియలు విరిగి రహదారిపైకి వస్తున్న నీరు

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపోడ పంచాయతీ బోండఘాటీపై కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో ఖొయిర్‌పూట్ రహదారి మూసివేశారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. వర్షం తగ్గితే తదుపరి చర్యలకు ఉపక్రమిస్తారు. వాగులు కూడా నిండుగా ప్రవహిస్తుండడంతో సహాయక చర్యలు చేపడుతున్నారు. జిల్లా యంత్రాంగం అంతా ఆదివారం కూడా విధుల్లో ఉండాలని కలెక్టర్ సచిన్ పవార్ ఆదేశించారు.



ఖోయిర్‌పూట్ ప్రాంతంలో రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

గులుగుండలో వైద్య శిబిరం



గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: కొండ ప్రాంతాల్లోని ఆదివాసీ, హరిజన గ్రామాల్లో జిల్లా వైద్య శాఖ విరివిగా వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. గత కొద్ది రోజులుగా మలేరియా వ్యాధి జిల్లాలో విస్తరిస్తున్న నేపథ్యంలో దాని నియంత్రణ చర్యలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పద్మపూర్ సమితి గులుగుండ గ్రామంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించింది. కొండపై ఉన్న ఈ గ్రామానికి పద్మపూర్‌లోని పీహెచ్‌సీ వైద్య బృందం సుమారు 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి చేరుకుంది. గ్రామంలోని తాగునీటి సౌకర్యాలను పరిశీలించిన వైద్య బృందం, గ్రామస్తులు వినియోగిస్తున్న తాగునీటి నమూనాలను సేకరించింది. అదేవిధంగా గ్రామంలో అందిరికీ వైద్య పరీక్షలను నిర్వహించింది. ముఖ్యంగా మలేరియా, డెంగీ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కలిగించింది. అస్వస్థతతో ఉన్న కొందరి రక్త నమూనాలను సేకరించిన వైద్య బృందం వాటిని పరీక్ష కోసం తరలించింది. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసింది. గ్రామంలో పరిశుభ్రత పాటించి నీటిని మరిగించి తాగాలని, అదేవిధంగా పడుకున్న సమయంలో దోమ తెరలను వినియోగించాలని సూచించింది. పద్మపూర్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి మనోజ్ పండ నేతృత్వంలో వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితులను అధ్యయనం చేశారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్య బృందానికి సహకరించారు. మారుమూల కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామాల్లో జిల్లా ఆరోగ్య శాఖ ఇటువంటి తరహా వైద్య శిబిరాలను నిర్వహించి, ప్రజల ఆరోగ్యాలను అధ్యయనం చేస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని మెడికల్ అధికారి పండ తెలియజేశారు.

ఆహార కేంద్రం తనిఖీ



ఆహర కేంద్రంలో ఆరా తీస్తున్న బీజేపీ నాయకులు



ఆహార కేంద్రంలో తింటున్న వారు

రాయగడ: పేదలకు రూ.5కే అందిస్తున్న ఆహార పథకంలో నాణ్యత లోపిస్తోందని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల ఎదురుగా గల ఆహార కేంద్రంలో ఈ మేరకు శనివారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. డాల్మాలో కనీసం కూరగాయలు లేకుండా కేవలం నీళ్లతో కూడిన పప్పును మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. సుమారు గంట సమయం ఆహార కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. నాణ్యత లేని ఆహారం అందించడంపై జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువెళతామని బీజేపీ నాయకులు రంగావు కొండగిరి, శంకర్ జిలకర, సత్యవాన్ మండంగి తెలిపారు. తమకు ప్రభుత్వం కేవలం రూ.23 ఇస్తుందని ప్రస్తుతం కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా డాల్మాను తయారు చేసి పంపిణీ చేస్తున్నామని ఆహార కేంద్రం నిర్వాహకులు అగ్నిగంగమ్మ ఎస్‌హెచ్‌జీ మహిళలు తెలియజేశారు.

నా కుమార్తెను బలి తీసుకున్నారు..

- గార ఎస్‌బీఐ బంగారం కేసులో మా కుటుంబాన్ని ఇరికించారు
- బ్యాంకు ఉద్యోగి స్వప్న ప్రియ తల్లి సరళ
- జాతీయ మహిళా, మానవహక్కుల కమిషన్లకు ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: గార ఎస్‌బీఐలోని బంగారం మాయం కేసులో తమ కుటుంబాన్ని అన్యాయంగా ఇరికించారని, తన కుమార్తె ఉరిటి స్వప్నప్రియను బలి తీసుకున్నారని ఆమె తల్లి ఉరిటి సరళ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ తోటకూర రమణమూర్తి రాజుపై జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్లకు ఈనెల 13న ఫిర్యాదు చేశారు. తన కుమార్తెకు విడాకులయ్యాయని, తన వద్దే నివసించేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. 2022 నుంచి తన కుమార్తె గార బ్రాంచిలో పనిచేయడం, 2023 నవంబరు 20న లీవ్ పెట్టడం, ఆ ముందు రోజే వేరే వ్యక్తికి స్వప్నప్రియ డ్యూటీ ఛార్జి ఇవ్వడం జరిగిందని, అదే నవంబరు 24న తనఖా బంగారం మాయమైనట్లు బ్యాంకు అసోసియేషన్ ద్వారా తన కుమార్తెకు తెలియడం, బయటకు కూడా వెలుగులోకి రావడం జరిగిందన్నారు. పత్రికల్లో, సోషల్ మీడియాలో పథకం ప్రకారం కొంతమంది బ్యాంకు ఉద్యోగులే స్వప్నప్రియ నేరం చేసినట్లు రాయించారని ఆరోపించారు. 2023 నవంబరు 28న ఆర్ఎం రాజు కొన్ని పత్రికల్లో గార బ్యాంకులో బంగారం పోలేదంటూ స్టేట్‌మెంట్లు ఇచ్చారని, అదే రోజు స్వప్నప్రియతో పాటు జాయింట్ కస్టోడియన్‌గా ఉన్న క్యాషియర్ తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు చెప్పాడని, స్వప్నప్రియే నగలు కాజేసి విషయం బయటకు ఎక్కడ పొక్కుతుందోనని తనపై దాడి చేయించినట్లు రూర ల్ పీఎస్‌లో తప్పుడు కేసు పెట్టాడన్నారు. అది భ రించలేని తన కుమార్తె అన్ని నేరాల్లో తననే బాధ్యురాలిగా చేయడం, పత్రికల్లో వచ్చిన కథనాలు, కుటుంబం తన వల్ల అప్పులు చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ విషయంలో అప్పటి ఆర్ఎం రాజుపై చర్యలు తీసు కోవాలని కోరారు. ఈ విషయంపై దర్యాప్తు అధికారిగా ఉన్న డీఎస్పీ యర్రగుంట శృతి వద్ద శనివారం సాయంత్రం ప్రస్తావించగా కేసు ఛార్జిషీటు నమోదు కాలేదని, దర్యాప్తులోనే ఉందని అన్నారు. స్వప్నప్రియ ఆత్మహత్య, ఆమె తల్లి ఆరోపణలపై శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ వాసుదేవరావు వద్ద ఇదే విషయం ప్రస్తావించగా కేసు పెండింగ్‌లో ఉందని ఆయన అన్నారు.

గుర్రపు డెక్కను తొలగించాలి

హిరమండలం: గొట్టా బ్యారేజీలో గుర్రపు డెక్కను తొలగించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బడితి అప్పలనాయుడు కోరారు. శనివారం వంశధార గొట్టాబ్యారేజీలో ఉన్న గుర్రపు డెక్కను ఆయన పరిశీలించారు. వరదలకు కొట్టుకొచ్చిన గుర్రపు డెక్క కాలువల్లోకి నీరు వెళ్లకుండా అడ్డుకుంటోందని, తొలగించాలని కోరారు.



గొట్టా బ్యారేజీ వద్ద గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న రైతుసంఘ కార్యదర్శి అప్పలనాయుడు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



గాయపడిన వ్యాన్ డ్రైవరు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. లెడోబోందో వద్ద కారును బైక్ ఢీకొట్టడంతో బైక్‌ను నడుపుతున్న సాయిరాం మహాపాత్రోకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి మోహనా పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బరంపురం మెడికల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి స్వగ్రామం బిరికోట్ అని పోలీసు అధికారులు తెలిపారు. మరో ఘటనలో.. మోహనా బ్లాక్ పరిధిలో అడవ పంచాయతీ దమ్మాదువా గ్రామ సమీపంలో ప్రైవేటు బస్సు, మ్యాక్స్ పికప్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవరు ఉమాశంకర్ రోణాకి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. అడవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిల్లుల చెల్లింపునకు బారులు



ఈఆర్వో కార్యాలయం వద్ద బారులు తీరిన వినియోగదారులు

అరసవల్లి: విద్యుత్ వినియోగదారులకు కొత్త యా ప్ కష్టాలు మొదలయ్యాయి. ఇంతవరకు నేరుగా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యూపీఐ పేమెంట్ల రూపంలో విద్యుత్ వినియోగ చార్జీలను చెల్లించేవారు. ఇప్పుడు పూర్తిగా ఏపీఈపీడీసీఎల్ యాప్ ద్వారానే బిల్లులు చెల్లించాలంటూ కొత్త ఆంక్షలు విధించడంతో వినియోగదారులు అవగాహన లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇంకా విస్తృతంగా ప్రచారం లేకపోవడంతో.. కొందరు వినియోగదారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా రు. విద్యుత్ వినియోగదారులు తమ ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి లేదా ఏపీఈస్ట్రన్‌పవర్.కాం వెబ్‌సైట్ నుంచి గానీ సంస్థ అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇకమీదట ఆన్‌లైన్ పే మెంట్లు అన్నీ ఇలాగే చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొత్త యాప్ అమలు తెలియక చాలా మంది ఈఆర్వో కార్యాలయం వద్ద వినియోగదారులు బారులు తీరారు. అక్కడైనా విద్యుత్ సిబ్బంది యా ప్‌పై అవగాహన కల్పించేలా ప్రత్యేక డెస్క్‌ను ఏర్పా టు చేస్తే బాగుండుననే అభిప్రాయాలు వ్యక్తమయ్యా యి. ఒక్కరోజు గడువు తీరితే ఫైన్‌లు పడతాయనే ఆందోళనతో యాప్ కష్టాలు పడుతూనే ఈ ఆర్వో కార్యాలయానికి వినియోగదారులు క్యూ కట్టారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బోల్‌భం భక్తులకు సకల సౌకర్యాలు



గుప్తేశ్వర్‌లో శ్రావణ మాసం ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో అధికారులు

జయపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధ శివ క్షేత్రం గుప్తేశ్వర్‌కు శ్రావణ మాసంలో వచ్చే బోల్‌భం భక్తుల కోసం సకల సదుపాయాలు కల్పించాలని జయపురం హిందూ సమాజ్ ప్రతినిధులు అధికారులను కోరారు. జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయ సభా గృహంలో కావిడి దారుల కోసం కల్పించాల్సిన సదుపాయాలపై శనివారం సమావేశం నిర్వహించారు. శ్రావణ మాసంలో ప్రతి దినం వేలాదిమంది బోల్‌భం భక్తులు ఒడిశా నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వస్తారని వారు పాత్రోపుట్ కొలాబ్ నదిలో కలశాలలో పవిత్ర జలాలు నింపి కావిడిలతో పాదాలతో నడుచుకుంటూ 50 కిలోమీటర్లకు పై దూరం నడచి గుప్తేశ్వర్ వెళ్తారని, వారికి మార్గంలో తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. గుప్తేశ్వర్‌లో భక్తులకు సౌకర్యాల కల్పనపై సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ అధ్యక్షతన జరిగిన సమావేశం చర్చించారు. వర్షాలు పడుతుండటంతో భక్తుల రక్షణపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు సూచించారు. భక్తులు విడిది చేసేందుకు రామగిరి, గుప్తేశ్వర్‌లలో తగు ఏర్పాట్లు చేయగలమని సమావేశంలో అధికారులు వెల్లడించారు. అలాగే బొయిపరిగుడ నుంచి గుప్తేశ్వర వరకు పోలీసు పెట్రోలింగ్ నిర్వహించేందుకు పోలీసు అధికారులకు ఆదేశించారు. గుప్తేశ్వర్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గుప్తేశ్వర్ వద్దగల శబరీ నది వద్ద అగ్నిమాపక సిబ్బంది, వాట్రాప్ టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలని ఆయా విభాగాల అధికారులు ఆదేశించారు. సమావేశంలో దేవదాయ అధికారి జయపురం తహసీల్దార్ డాక్టర్ మనోలిశ ఆచారి, జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ,బొయిపరిగుడ అటవీ విభాగ అధికారి రామచంద్ర నేపాక్ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి



సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన విశ్రాంత శ్రామికులు

జయపురం: జయపురం గగణాపూర్ సేవా పేపరు మిల్లు విశ్రాంత శ్రామికులు శుక్రవారం జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. కొత్త యాజమాన్యం బాధ్యతలు తీసుకుని ఐదేళ్లు పూర్తి కావస్తున్నా విశ్రాంత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదని, పెన్షన్, పీఎఫ్‌లు ఇవ్వలేదని ఆరోపించారు. మిల్లులో 250 మందికిపైగా విశ్రాంత శ్రామికులు ఉండగా వారిలో 36 మంది తమకు మిల్లు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలు పొందకుండానే మరణించారని అన్నారు. వారి కుటుంబాలకు కూడా పీఎఫ్, పెన్షన్, గ్రాడ్యుటీ లభించలేదన్నారు. 2018 నుంచి శ్రామికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదని బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ వెల్లడించి వెంటనే అమలు చేయాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు విశ్రాంత శ్రామికులు మిల్లు ప్రధాన గేటు ముందు నిత్యం ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. యాజమాన్యం దిగి వచ్చేంతవరకు ఈ ఆందోళన సాగుతుందని హెచ్చరించారు.

కాల్పుల ఘటనలో ఆరుగురు అరెస్టు



సూరజ్ ఖోశ్ల



లక్ష్మణ్ ఖోశ్ల



గుంజన్ లాల్



సురేష్ ఖోశ్ల



అశోక్ నాగ్



అర్జున్ బారిక్

జయపురం: సమితి పరిధి ఉమ్మిరి గ్రామంలో రెండు వర్గాల మధ్య ఇటీవల జరిగిన కాల్పులు, కుమ్ములాటల కేసులో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్రతండి శనివారం వెల్లడించారు. అరెస్టైనవారు ఉమ్మిరి హరిజన వీధికి చెందిన సూరజ్ ఖోశ్ల ఉరఫ్ మున, లక్ష్మణ్ ఖోశ్ల, గుంజన్ లాల్, సురేష్ ఖోశ్ల, ఆకాశ్ నాగ్, మయిరా సాహి అర్జున బారిక్‌ల ఉన్నట్లు పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య జరిగిన అల్లర్లపై ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే మరో గ్రూపు నుంచి ఒక వ్యక్తి కూడా ఫిర్యాదు చేశాడని, ఆ ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేశామన్నారు. సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. దర్యాప్తు పూర్తయితే కాల్పులు చేసినవారు ఎవరో తెలిసే అవకాశం ఉందన్నారు.

బొడొనాళొ గేట్లు ఎత్తివేత

రాయగడ: సాగు అవసరాల కోసం బొడొ నాళొ మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టు గేట్లను శనివారం అధికారులు ఎత్తివేశారు. దీంతో గుణుపూర్, గుడారి సమితులతో పాటు పద్మపూర్‌లో సుమారు 9 వేల ఎకరాల విస్తీర్ణంలో పంటపొలాలకు సాగునీరు అందే అవకాశం లభించింది. రైతుల డిమాండ్ల మేరకు పద్మపూర్ తహసీల్దార్ దీప్తిమయి పాత్రో, అడవ డివిజినల్, కెందుగుడ బొడొనాళొ నీటి పారుదల ప్రాజెక్టు బాధ్యతలను నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజీవ్ కుమార్ పండిత్, బొడొపాళొ ప్రాజెక్టు అసిస్టెంట్ ఇంజనీర్ అలేఖ కుమార్ రౌత్ సమక్షంలొ ప్రాజెక్టు గేట్లను పూజా కార్యక్రమాలను నిర్వహించి ఎత్తారు.



బొడొనాళొ నీటిపారుదల గేట్లను ఎత్తేందుకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

మాదక ద్రవ్యాల వాడకంపై నిఘా



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాదక ద్రవ్యాలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, వీటి వినియోగంపై నిఘా ఉంచాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. పిల్లల్లో డ్రగ్స్ వాడకాన్ని నియంత్రించేందుకు జిల్లా స్థాయిలో సంయుక్త కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాంలతో కలిసి ఆయన చర్చ నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి ఒక రిపోర్టు తయారు చేస్తే ఆ రిపోర్టును రాష్ట్రంలో అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో కుటుంబ విలువలకు భంగం వాటిల్లుతుందన్నారు. వసతి గృహాల్లో ఆల్కహాల్, మాదక ద్రవ్యాలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. డ్రగ్స్ నిరోధంపై హోర్డింగులు ఏర్పాటు చేయాలని, సినిమా థియేటర్లలో యాడ్‌లు వేయాలని సభ్యులు కోరగా పౌర సంబంధాల శాఖ అధికారి కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ సినిమా థియేటర్లలో స్లైడ్స్ వేసేందుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి థియేటర్లకు ఆదేశాలు ఉండాలని చెప్పారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో మాదక ద్రవ్యాల నిరోధంపై బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నట్లు రైల్వే ఎస్ఐ చెప్పారు. ఆర్టీసీలో మాదక ద్రవ్యాల రవాణాపై సంబంధిత డ్రైవర్లు కండక్టర్లకు, పార్శిల్ సర్వీసులకు సంబంధించి సిబ్బందికి ఇప్పటికే సూచించినట్లు ఆర్ఎం వివరించారు.

క్లుప్తంగా

పెదకుదమలో గజరాజులు



పెదకుదమ వద్ద రహదారి దాటుతున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పంట పొలాలలో శనివారం సాయంత్రం ఏనుగులు దర్శనమిచ్చాయి. పంట పొలాల నుంచి రహదారిపైకి రావడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. అరటి, పామాయిల్ తోటలను ధ్వంసం చేయడంతో పాటు వరినారు మళ్లలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాటిని తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు. రాత్రి సమయాన గ్రామంలోకి వచ్చే అవకాశముందని రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు సూచించారు.

విద్యుదాఘాతంతో మేకల మృతి

మెరకముడిదాం: మండలంలోని ఇప్పలవలస గ్రామంలో విద్యుత్ షాక్‌తో రెండు మేకలు శనివారం మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇప్పలవలస గ్రామానికి చెందిన కన్నూరి గణనాథ తన మేకలను మేత కోసం పొలాల్లోకి తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం పొలాల్లో మేస్తున్న మేకలు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లేసరికి షాక్‌కు గురయ్యాయి. అక్కడికక్కడే రెండు మేకలు మృతి చెందాయి. మరో మేక తప్పించుకొని పారిపోయింది. మృతి చెందిన రెండు మేకల విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని పెంపకందారుడు బోరుమన్నాడు. తనకు ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని కోరాడు.

వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

విజయనగరం క్రైమ్: స్థానిక సంతకాల బ్రిడ్జి పక్కన ఉన్న రైల్వే ప్రహరీ గోడ పక్కన ఉన్న చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ విచారణ చేపట్టారు. మృతుడు కాఫీ రంగు, గులాబీ రంగు నిలువు గీతలు కలిగిన తెలుపు షర్ట్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడన్నారు. తెలుపు రంగు చుక్కలు కలిగిన ఆకుపచ్చ రంగు టవల్‌తో ఉరి వేసుకున్నట్లు గుర్తించామన్నారు. మృతుని ఆచూకీ ఇంకా తెలియరాలేదని, ఆచూకీ తెలిసిన వారు 94906 17089 నంబరును సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

- డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

వంగర: పాఠశాలల్లో పెండింగ్‌లోని నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని యూకేగుమ్మడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఫేజ్-2లో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన పనులు, పెండింగ్‌లోని పనులు, పనులకు వెచ్చించిన నిధులపై ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావును ఆరాతీశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సమయపాలన పాటించి, ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో కొలువైన శ్రీసీతారామస్వామికి ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామీణ కళాకారుల సంఘం అధ్యక్షుడు హైదిరాజు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పలువురు కళాకారులు స్వామి సన్నిధిలో చేపట్టిన భక్తి భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలకు హాజరై, స్వామి వారిని దర్శించుకున్నారు.

కాటేసిన కనుపాప

- కన్న కూతురిపై తండ్రి అఘాయిత్యం
- తల్లి ఊరెళ్లడంతో కన్నేసిన కిరాతక తండ్రి
- అమ్మమ్మ తలుపు తట్టడంతో బయట పడ్డ ఘోరం
- ఆస్పత్రికి బాలిక తరలింపు
- పరారైన తండ్రి



బాధితురాలి ఇరుగుపొరుగు ఇళ్ల వద్ద ఆరా తీస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: మొన్నటికి మొన్న ఊయలలో నిద్రపోతున్న ఆరు నెలల చిన్నారిపై అఘాయిత్యం మరచిపోక ముందే మరో ఘోరం! చిన్నారిపై అకృత్యం తెలిసి సభ్య సమాజం ఎటు వెళ్తోందో అర్థం చేసుకునే లోపే మరో కిరాతకం! మైనర్ బాలికైన పన్నెండేళ్ల కన్న కూతురిపైనే అఘాయిత్యానికి పాల్పడ్డాడో దుర్మార్గపు తండ్రి! కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కాటేశాడు. తండ్రి అనే బంధానికే తలవంపులు తెచ్చే ఘోరమైన సంఘటన బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్న నర్సింగ్‌కు భార్య మంగమ్మ, వృద్ధురాలైన అత్త ఉన్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇటీవలే పెద్ద కుమార్తె రజస్వల అయింది. నర్సింగ్ అత్త పలు ఇళ్లల్లో పాచి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. నర్సింగ్ కూడా మొన్నటి వరకూ కోళ్ల ఫారంలో పని చేస్తూ మానేసి ఈ మధ్యే పెయింటింగ్ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మంగమ్మ విజయనగరం వెళ్లింది. అమ్మమ్మ వీధిలో పనుల నిమిత్తం వెళ్లింది. ఇంట్లో పిల్లలు, నర్సింగ్ ఉన్నారు. దీంతో తండ్రి పన్నెండేళ్ల కుమార్తెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ సమయంలో చిన్నారి అమ్మమ్మ పనులు ముగించుకుని టీ తాగి మళ్లీ పనికి వెళ్దామని ఇంటికి రాగా తలుపులేసి ఉన్నాయి. ఆమె తలుపు తట్టినా తీయక పోవడంతో వెనుకవైపు ఉన్న బలహీనమయిన తలుపు వచ్చేసింది. ఈ సమయంలో చిన్నారి వివస్త్రగా గదిలో ఓ మూల ఉండటం చూసిన అమ్మమ్మ భయపడి పెద్దగా కేకలేసింది. దీంతో చుట్టుపక్కల వారు కూడా వచ్చి చిన్నారి పరిస్థితిని చూసి బాలికకు దుస్తులు వేశారు. విషయం తెలుసుకున్న సోషల్ వర్కర్ కుప్ప రమణమ్మ ఈ విషయమై నర్సింగ్‌ను, భార్య మంగమ్మను నిలదీసింది. నర్సింగ్ భార్య అతనిని వెనకేసుకు రావడంతో పరిస్థితి బాలేదని పోలీసులకు సమాచారమిచ్చింది. వారి అత్త కూడా ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో పోలీసులు రంగంలోకి దిగారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు బాడంగి మహిళా ఎస్సై జయంతి సహకారంతో బాలికను ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించారు. ఆస్పత్రికి, బాధితురాలి ఇంటికి డీఎస్పీ వెళ్లి చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. ఘటనపై ఆరా తీశారు. భర్తను వెనుకేసుకు వస్తున్న భార్య, నర్సింగ్‌తో పాటు కుటుంబ సభ్యులు పరార్ అయినట్టు నిర్ధారించుకున్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ బాలికను పరీక్షించిన వైద్యులు ఏమీ జరగలేదని చెప్పారన్నారు. రిపోర్టులు కూడా తీసుకుంటున్నామన్నారు. బాలిక అమ్మమ్మ, ఇతర కుటుంబ సభ్యులు, బాధితురాలి ఫిర్యాదును అనుసరించి పోక్సో కేసు నమోదు చేయనున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ విషయమై హోం మంత్రి పేషీ నుంచి ఏం జరిగిందో వెంటనే వివరాలిమ్మని అడిగే వరకూ స్థానిక పోలీసులు కూడా విషయాన్ని మీడియాకు సమాచారమివ్వక పోవడం విచారకరం.

మన్యంలో విస్తారంగా కురిసిన వర్షాలు



పార్వతీపురంలో కురిసిన వర్షం


పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసాయి. శుక్రవారం, శనివారాలలో జిల్లాలోని పలు ప్రాంతాలలో వర్షం కురిసింది. వర్షాలకు చెరువులలో, వాగులలో, పంట పొలాలలో నీరు చేరింది. వరి ఉభాలు గ్రామాలలో ఊపందుకున్నాయి. జిల్లాలో 670.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

మండలాల వారీగా వర్షపాతం

మండలం	వర్షంపాతం (మిల్లీమీటర్లలో..)
వీరఘట్టం	45.6
సీతంపేట	72.6
భామిని	45.6
పాలకొండ	51.6
కొమరాడ	25.2
గుమ్మలక్ష్మీపురం	22.8
కురుపాం	70.8
జియ్యమ్మలస	34.6
గరుగుబిల్లి	64.0
పార్వతీపురం	47.8
మక్కువ	23.0
సీతానగరం	44.6
బలిజిపేట	59.6
సాలూరు	32.6
పాచిపెంట	29.8
మొత్తం	670.2

పెద్దగెడ్డ గేట్లు ఎత్తివేత

పాచిపెంట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దగెడ్డ జలాశయంలో నీటి ఉధృతి పెరిగింది. నీటి మట్టం పెరగడంతో శనివారం జలాశయం రెండు గేట్లను అధికారులు ఎత్తివేసారు. 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు పెద్దగెడ్డ జలాశయం జేఈ రవి తెలిపారు.



పెద్దగెడ్డ గేట్లు ఎత్తివేయడంతో దిగువకు వెళ్తున్న నీరు

పంట నష్టంపై ప్రాథమిక నివేదిక



వరినారును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు తదితరులు

డెంకాడ: తుఫాన్ వర్షాల వలన దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తెలిపారు. మండలంలోని సింగవరం పరిధిలో దెబ్బతిన్న నువ్వు పంటను ఆయన శనివారం పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న వరి వెద, యంత్రాలతో ఉభాలు చేసేందుకు వేసిన వరినారును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి రామారావు మాట్లాడుతూ మండలాల నుంచి వచ్చిన పంట నష్టం ప్రాథమిక లెక్కల మేరకు జిల్లా స్థాయిలో నష్టపరిహారం లెక్కిస్తామన్నారు. ఆయన వెంట ఏడీఏ ఎ.నాగభూషణం, ఏఈఓ రామకోటి తదితరులు ఉన్నారు.

భవనం పైనుంచి పడి మేస్త్రీ దుర్మరణం

ఆరిలోవ(విశాఖ తూర్పు): జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు లేబర్ మేస్త్రీ రౌతు పాపారావు(45) మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. విశాలాక్షినగర్‌లో ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఇందులో భాగంగా శనివారం లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టారు. లిఫ్ట్ అమర్చే క్రమంలో భవనం రెండో ఫ్లోర్‌లో ఉండగా.. దాని అడుగు భాగం తొట్టి లేబర్ మేస్త్రీ రౌతు పాపారావుపై జారి పడింది. దానితో పాటు కింద పడిన మేస్త్రీ తలకు తీవ్రగాయాలై మెద భాగం కొంత కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బతుకుతెరువు కోసం వచ్చి..

రౌతు పాపారావుది విజయనగరం జిల్లా మెంటాడ మండలం పోరాం గ్రామం. అక్కడ నుంచి కొన్నేళ్ల కిందట బతుకుతెరువు కోసం విశాఖపట్నం వచ్చి 10వ వార్డు రవీంద్రనగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలున్నారు. భవన నిర్మాణ పనుల్లో లేబర్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరు పిల్లల్లో పెళ్లీడుకొచ్చిన కుమార్తె ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. కుమారుడు చదువుతున్నాడు. కుటుంబాన్ని పోషించే పాపారావు మృతి చెందడంతో అతడి భార్య, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

టోల్‌గేట్‌ను తరలించాలి

- కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి మంత్రి కొండపల్లి లేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: జిల్లాలోని జొన్నాడ సమీపంలోని బోడమెట్టపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను బైపాస్ రోడ్డులోకి మార్చాలని కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లేఖ రాశారు. ఈ టోల్ గేట్ వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాహనదారులకు పెనుభారంగా మారిందని ఆ లేఖలో పేర్కొన్నారు. టోల్‌గేట్ ఏర్పాటు చేసే ముందు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టలేదని నిబంధనలను పాటించలేదని పేర్కొన్నారు. రాయపూర్-విశాఖపట్నం 26వ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-43)పై మోదవలస నుంచి గొట్లాం వరకు రోడ్డును విస్తరించి నాలుగు లేన్ల రహదారిగా నిర్మాణం పూర్తి చేసి దాదాపు ఐదేళ్ల క్రితమే వినియోగంలోకి తెచ్చారని తెలిపారు. ఇప్పుడు ఈ రోడ్డుపై కొత్తగా టోల్ ప్లాజాను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. వాస్తవానికి వినియోగంలోకి వచ్చిన 45 రోజుల్లోనే టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసి రుసుం వసూలు చేయాల్సి ఉందని కానీ వినియోగంలోకి వచ్చిన ఐదేళ్ల తరువాత ఇక్కడ టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసి ఈ నెల 2వ తేదీ నుంచి వసూళ్లు మొదలు పెట్టారని వివరించారు. సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఈ టోల్ ప్లాజాను కొత్తగా నిర్మించిన విజయనగరం బైపాస్ రోడ్డులోకిక తరలించాలని మంత్రి కొండపల్లి కోరారు.

ఆద్యంతం.. ఉత్కంఠ భరితం



అండర్-15,17 బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీసి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత కల్పించటంలో భాగంగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో మొత్తం నాలుగు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన పోటీల్లో భాగంగా మూడవ రోజు శనివారం అండర్-19, మెన్/ ఉమెన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు తలపడ్డారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను కనబరిచేందుకు ఉత్సుకత చూపించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేయటంతో పాటు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరఫున అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఆదివారం చివరి రోజు వెటరన్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. 35 సంవత్సరాల వయస్సు పైబడిన క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడనున్నారు.

అండర్-15, 17 విభాగాల్లో విజేతలు వీరే...

జిల్లా స్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పోటీల్లో అండర్ - 15, 17 విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ వీఎస్.ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుటుంబరావు, ఉపాధ్యక్షుడు వై.కుసుంబచ్చన్ తదితరులు బహుమతులు ప్రధానం చేశారు. అండర్ - 15 బాలుర సింగిల్స్ విభాగంలో సిహెచ్.మేఘవర్స్, ఎంవి.నాగసాయిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా... డబుల్స్ విభాగంలో సిహెచ్.మేఘవర్స్ - ఎం.జాన్సన్‌ల జట్టు, ఎం.వి.నాగసాయి - డి.రామ్ చరణ్‌ల జట్టు మొదటి రెండు స్థానాలు చేజిక్కించుకున్నాయి. అండర్ - 15 బాలికల సింగిల్స్ విభాగంలో ఎం.ఉజ్వల, ఎండి.నిషాద్‌ఫాతిమాలు.... డబుల్స్ విభాగంలో ఎస్.లాస్యశ్రీ-ఎస్.లాస్యల జట్టు, బి.కీర్తి-ఎస్.హర్షిత జట్టు విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలుర సింగిల్స్ విభాగంలో ఎం.రోహిత్, కె.లోకేష్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకోగా... డబుల్స్ విభాగంలో కె.లోకేష్-ఎం.రోహిత్‌ల జట్టు, ఎవి.భరద్వాజ్-ఎవి.చైతన్యల జట్టు విజేతలుగా నిలిచారు. బాలికల సింగిల్స్ విభాగంలో ఎం.ఉజ్వల, ఎస్.లాస్యలు మొదటి రెండు స్థానాలు చేజిక్కించుకోగా... డబుల్స్ విభాగంలో ఎం.ఉజ్వల-ఎం.మోక్షిత జట్టు, బి.విష్ణుప్రియ- ఎం.భూమికల జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో దక్కించుకున్నారు.

ఇద్దరి బలవన్మరణం

- వివాహేతర సంబంధమే కారణం



మృతిచెందిన వెంకటరావు



మృతిచెందిన అన్నపూర్ణ

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని జరడు కాలనీకి చెందిన ఇద్దరు వివాహేతర సంబంధం నేపథ్యంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. కాలనీకి చెందిన తాడంగి అన్నపూర్ణ(30), తాడంగి వెంకటరావు(35) విషం తాగి తనువు చాలించారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. జరడు కాలనీలో కొంత కాలంగా అన్నపూర్ణ, వెంకటరావు నివాసం ఉంటున్నారు. అన్నపూర్ణ 2014లో అదే గ్రామానికి చెందిన టి.కృష్ణారావును ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి నలుగురు మగ పిల్లలు జన్మించగా.. ఇద్దరు మృతి చెందగా సిద్ధూ, అరవింద్ ఉన్నారు. అదే గ్రామానికి చెందిన తాడంగి వెంకటరావుకు భార్య, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో అన్నపూర్ణ, వెంకటరావు మధ్య కొంత కాలంగా వివాహేతర సంబంధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన ఇద్దరూ గ్రామంలో కనిపించకుండాపోయారు. దీంతో ఈ నెల 8న సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే జరడు కాలనీకి చెందిన సూర్యారావుకు పక్క గ్రామమైన తుంబలి గ్రామస్తుడు కె.సుమంత్ ఫోన్ చేసి అన్నపూర్ణ, వెంకటరావు హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఉన్నారని సమాచారం ఇచ్చాడు. దీంతో చిన్నబగ్గ సర్పంచ్ నీలయ్యతో పాటు పలువురు గ్రామ పెద్దలు హైదరాబాద్ నుంచి వారిని తీసుకురావడానికి ఈ నెల 16న వెళ్లారు. అక్కడ కౌన్సెలింగ్ చేసి ఈ నెల 18న కారులో బయలుదేరి వచ్చారు. మార్గంలో మండలంలోని కుశిమి జంక్షన్‌కు వచ్చేసరికి ఇద్దరూ పాస్‌కు వస్తుంది ఆపమని కారు నిలుపుదల చేయించారు. పొదల మాటుకు వెళ్లి విషం తీసుకున్నారు. కొద్ది సేపటికి నోటి నుంచి చొంగలు రావడంతో వెంటనే శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యం చేసిన అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి అన్నపూర్ణ చనిపోగా, శనివారం ఉదయం వెంకటరావు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

క్షేత్ర స్థాయిలో మలేరియా కేసుల పరిశీలన



పాతవూరులో గతంలో వచ్చిన మలేరియా కేసులను పరిశీలించిన జోనల్ మలేరియా అధికారిణి శాంతిప్రభ

- జోనల్ మలేరియా ఆధికారిణి శాంతిప్రభ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలో మలేరియా కేసులను జోనల్ మలేరియా అధికారిణి ఎం.శాంతిప్రభ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బొద్దాం పీహెచ్‌సీ పరిధిలోని కొండగంగుబూడి పంచాయతీ పాతవూరులో ఈ ఏడాది నమోదైన ఎనిమిది కేసులను పరిశీలించి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అనంతరం బొద్దాం పీహెచ్‌సీని సందర్శించిన ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికొకసారి డ్రై డే పాటించేలా క్షేత్ర స్థాయిలో గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్ మూర్తి, ఎంపీహెచ్‌ఈఏ తిరుపతిరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

- అవకతవకలకు పాల్పడే ఆస్పత్రుల లైసెన్సులు రద్దు చేయాలి
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెంచాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. జిల్లాలోని 108 ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేసి తనకు నివేదిక అందజేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావును ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేయించుకున్న వారి వివరాలను పరిశీలించాలని తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ పక్రియ చట్టం - 1994 అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం (పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్) శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలో 88 స్కానింగ్ సెంటర్లపై ఆరా తీసారు. నిపుణులైన వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఇవి నడిచేలా చూడాలన్నారు. అనుమతులను ఇచ్చినప్పుడు కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేసి, నిబంధనల ప్రకారం మాత్రమే స్కానింగ్ సెంటర్లకు అనుమతులు జారీ చేయాలన్నారు. జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో భారీ తేడాలు ఉన్నాయని వాటికి కారణాలపై ఆరా తీసారు. ఎట్టి పరిస్థితిలోనూ గర్భస్థ లింగ నిర్ధారణ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలు, అబార్షన్లన్నీ కచ్చితంగా పోర్టల్‌లో నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆస్పత్రులు అందిస్తున్న సేవలను తనిఖీ చేయాలని సూచించారు. అవకతవకలకు పాల్పడే ప్రైవేటు ఆస్పత్రుల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.మీనాదేవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిఎస్.జయలక్ష్మి, దిశ సీఐ నాగేశ్వరరావు, నేచర్ సంస్థ ప్రతినిధి ఎస్.వికాశ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో ఏ ఒక్కరూ మరణించకూడదు..

విజయనగరం అర్బన్: జిల్లాలో సీజనల్ వ్యాధుల వలన ఏ ఒక్కరూ మరణించకూడదని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యంపై ఎంపీడీఓలు, మెడికల్ అధికారులు, ఈఓపీఆర్డీలతో కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈఓపీఆర్డీలు రెండు రోజుల్లో పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల వారీగా సమీక్షించి పారిశుద్ధ్యం మెరుగుదలకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గత వారం జరిగిన గ్రామ సందర్శనలో పారిశుద్ధ్యంపైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయని, వచ్చే గ్రామ సందర్శన నాటికి వాటన్నిటినీ పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి పైప్ లీకేజీలను గుర్తించి బాగుచేయడం, నీటి నిల్వలు లేకుండా చూడడం వంటి పనులు తక్షణమే జరపాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. మండల స్థాయిలో వైద్యాధికారులు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు సమీక్షించాలని, గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి గ్రామంలో విస్తృతంగా అవగాహన కలిగించాలని అన్నారు. మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి సందర్శనలు చేయాలని అప్పుడే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో శతశాతం ప్రసవాలు జరిగేలా వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు, వైద్యులు ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులకు ఎందుకు వెళ్తున్నారని వైద్యుల్ని ప్రశ్నించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకరరావు, డీపీఓ శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

పెరుగుతున్న మడ్డువలస నీటిమట్టం



ప్రాజెక్టు వద్ద నీటిమట్టం

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. వర్షాలు విస్తారంగా కురవడంతో సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. నదుల నుంచి 1500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి ప్రాజెక్టులోకి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు వద్ద 63.62 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.147 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో మరో 10 రోజుల్లో ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీరు నిండే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.